ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రాజన్న సిరిసిల్ల

5★★★ జిల్లా వార్తలు

గురువారం 20 నవంబరు 2025

గీతా శ్లోక కంఠస్థ పోటీలు

వేములవాడ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గీతా జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని బాలరాజుపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో బుధవారం టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి గీతా శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించారు. జూనియర్ విభాగంలో ప్రథమ స్థానంలో జి.ప్రశాంతి, రెండోస్థానంలో లాత్విక, తృతియ స్థానంలో జి.అశ్విత నిలిచారు. సీనియర్ విభాగంలో మొదటి స్థానంలో ఏ. యశస్వి, రెండో స్థానంలో బీ.వైష్ణవి, మూడోస్థానంలో ఎన్.ప్రణతి నిలిచారు. టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ నిర్వాహకుడు రామిరెడ్డి, హెచ్ఎం అరుణ, ఉపాధ్యాయులు సంతోష్, దేవి, కవిత, ప్రేమ్‌కుమార్, మధుకర్‌రెడ్డి, టీటీడీ ధర్మాచార్యులు కేశెట్టి వీరన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మత్తు పనుల నేపథ్యంలో ఈనెల 20న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని 'సెస్' ఏఈ పృథ్వీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలకేంద్రంతో పాటు దుమాలకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన పాలకవర్గ సభ్యులు

సిరిసిల్ల రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పద్మశాలీ సంఘం నూతన పాలకవర్గ సభ్యులు బుధవారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్‌ను కలిసి సన్మానించారు. బీజేపీ పట్టణ మాజీ అధ్యక్షుడు అన్నల్‌దాస్ వేణు ఆధ్వర్యంలో పద్మశాలీ సంఘం నూతన పాలకవర్గ సభ్యులు బండి సంజయ్‌ను కలిసి పరిచయం చేసుకున్నారు. నూతన పాలకవర్గ సభ్యులను కేంద్ర మంత్రి సన్మానించారు.సిరిసిల్లలో నిర్మిస్తున్న మార్కండేయ ఆలయ నిర్మాణాలకు సహకరించాలని పాలకవర్గ సభ్యులు కోరారు. సంఘం అధ్యక్షుడు దూడం శంకర్, ప్రధానకార్యదర్శి మండల సత్యం,ఉపాధ్యక్షులు డాక్టర్ గాజుల బాలయ్య, మోర రవి, కోశాధికారి యెల్లె శ్రీనివాస్, సహాయ కార్యదర్శి కోడం శ్రీనివాస్ పాల్గొన్నారు.

బోగస్ సంఘాలకు చెక్



- క్రీడా సంఘాల లెక్కలకు కసరత్తు
- అసలైన అసోసియేషన్ల గుర్తింపునకు శాట్ ఆదేశాలు
- జిల్లాకు సంబంధం లేనివారు సంఘాలకు దూరమే..
- నూతన క్రీడా పాలసీ రూపకల్పన
- జిల్లాలో 14 గుర్తింపు క్రీడా సంఘాలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

క్రీడల పేరిట ఇష్టారాజ్యంగా పుట్టుకొస్తున్న సంఘాలకు చెక్ పెట్టే దిశగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(శాట్) కసరత్తు మొదలుపెట్టింది. గుర్తింపు క్రీడా సంఘాల వివరాలు సేకరించే దిశగా జిల్లా యువజన క్రీడా శాఖకు ఆదేశాలు ఇచ్చింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎలాంటి గుర్తింపు లేకుండా వెలుస్తున్న క్రీడా అసోసియేషన్లు క్రీడాకారుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. శాట్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు క్రీడా సంఘాల లెక్కలు తీసే పనిలో నడుం బిగించారు. జిల్లాలో క్రీడలతో సంబంధం లేని కొందరు వ్యక్తులు తామే క్రీడలకు దిక్కన్నట్లుగా వ్యవహరిస్తున్న తీరుకు తెరపడుతుందని భావిస్తున్నారు. అంతేకాకుండా ఒకే క్రీడాంశానికి సంబంధించి వేరువేరు సంఘాలు ఉన్నాయి. ముఖ్యంగా క్రికెట్, కరాటే వంటి క్రీడలకు సం బంధించి ఎలాంటి గుర్తింపు లేకుండానే తమకు తామే స్వతహాగా క్రీడా సంఘాలు ఏర్పాటు చేసుకున్నవారు ఉన్నారు.

జిల్లాలో 14 గుర్తింపు క్రీడా సంఘాలు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో అనేక క్రీడా సంఘాలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నప్పటికీ, కేవలం 14 సంఘాలు మాత్రమే బైలా ప్రకారం నడుస్తూ గుర్తిం పు పొందినవి ఉన్నాయి. క్రీడా సంఘాలకు స్టేట్ అసోసియేషన్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ గుర్తింపు ఉండాలి. జిల్లాలోని క్రీడా సంఘాలన్నీ తమ అసోసియేషన్ వివరాలు, క్రీడా సంఘం బైలా, స్టేట్ అసోసియేషన్ అఫిలియేషన్ పత్రంతో పాటు ఆయా సంఘాల సర్వసభ్య సమావేశాల వివరాలు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ సూచించిన ఫార్మాట్ ప్రకారం జిల్లా యువజన మిగతా 8వ పేజీలో

జిల్లాలోని గుర్తింపు క్రీడా సంఘాలు

సంఘం పేరు	అధ్యక్షుడు
అథ్లెటిక్ అసోసియేషన్	సీహెచ్ రామారావు
కబడ్డీ అసోసియేషన్	తోట రాంకుమార్
వాలీబాల్ అసోసియేషన్	సీహెచ్ శ్రీకుమార్
ఖో-ఖో అసోసియేషన్	బీ రవీందర్‌రావు
యోగా అసోసియేషన్	కె గోపాల్ రావు
కరాటే అసోసియేషన్	కొండ దేవయ్య
తైక్వాండో అసోసియేషన్	జే చక్రపాణి
సాఫ్ట్‌బాల్ అసోసియేషన్	డీ అర్చన
జూడో అసోసియేషన్	కె తిరుపతిరెడ్డి
యోగాసన, స్పోర్ట్స్ అసోసియేషన్	యెలిగేటి కృష్ణ
అమెచ్యూర్ స్పోర్ట్స్ కరాటే డీవో అసోసియేషన్	ఎండీ హనీఫ్‌ఖాన్
ఉషు స్పోర్ట్స్ అసోసియేషన్	ఎండీ మునీర్
వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్	గోగికార్ శ్రీనివాస్
టేబుల్ టెన్నిస్ అసోసియేషన్	ఎండీ అజీముద్దీన్

క్రీడా సంఘాలు కచ్చితమైన సమాచారం ఇవ్వాలి

రాందాస్, జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి



రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఉన్న గుర్తింపు క్రీడా సంఘాలు తమ సంఘానికి సంబంధించిన కచ్చితమైన వివరాలను జిల్లా క్రీడా శాఖకు అందించాలి. క్రీడాకారులకు జవాబుదారీగా ఉండడానికి, క్రీడా రంగాన్ని అభివృద్ధి చేయడానికి ఆయా సంఘాల వివరాలు సేకరణ ఉపయోగపడుతుంది. జిల్లాలోని క్రీడా సంఘాలు బైలా, గుర్తింపు పత్రాలు, జనరల్ బాడీ సమావేశాల వివరాలను అందించాలి.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం..

- జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి రాందాస్



టేబుల్ టెన్నిస్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న రాందాస్

సిరిసిల్ల టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలను జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలలో గెలుపు ఓటములు సహజం అని ఓడిన క్రీడాకారులు నిరుత్సాహ పడవద్దని అన్నారు. జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు వివిధ క్యాటగిరీల వారిగా పోటీలను నిర్వహించారు. అండర్-11, 13, 15, 17, 19 విభాగాలలో బాలబాలికలతో పాటు సీనియర్స్ కేటగిరిలో మహిళలు, పురుషులకు పోటీలను నిర్వహించారు. పోటీలలో విజేతలకు మెడల్స్‌ను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అజీమ్ ఉద్దీన్, కార్యదర్శి మొహమ్మద్ మునీరుద్దీన్, అబ్జర్వర్ బొల్లి సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్, సరిత, ప్రభాకర్, విద్యార్థినీ విద్యార్థులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి

సిరిసిల్ల టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులతో పాటు మెరిట్ సర్టిఫికెట్లను అందించారు. అనంతరం గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న యువతులు, మహిళలకు సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా సిరిసిల్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ప్రవీణ్‌కుమార్ న్యాయ చట్టాలు, ఫ్రీడమ్ ఆఫ్ లైఫ్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఎస్ ఆడెపు వేణుగోపాల్, ఏజీపీ చౌటపెల్లి వేణు, జిల్లా గ్రంథాలయం సంస్థ జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి బీ శంకరయ్య, గ్రంథపాలకుడు కమటం మల్లయ్య, న్యాయవాదులు విక్రమ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి



కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

చందుర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ గడ్డం నగేష్ నిర్వాహకులకు సూచించారు. చందుర్తి మండలంలోని మరిగడ్డ, కట్టలింగంపేట, లింగంపేట గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు లారీల కొరత ఉన్నట్లు తెలిపారు. అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ లారీల కొరత లేకుండా చూస్తామని, ధాన్యం కొనుగోలు సంబంధించిన రైతుల వివరాలను వెంటవెంటనే డాటా ఎంట్రీ చేయాలన్నారు. ఆయన వెంట ఏపీఎం పవన్‌కుమార్ ఉన్నారు.

23న జిల్లా స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు

సిరిసిల్ల టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఈనెల 23న జిల్లా స్థాయి పోటీలను నిర్వహిస్తున్నామని బుధవారం అసోసియేషన్ అధ్యక్షుడు సంగం స్వామి, ప్రధాన కార్యదర్శి గెట్టిముక్కల శేఖర్ తెలిపారు. పోటీల్లో 30 నుంచి 90 సంవత్సరాలు ఉన్న మహిళలు, పురుషులు పాల్గొనవచ్చన్నారు. రన్, జంప్స్, త్రోస్ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని, డిసెంబరు 13 నుంచి 14 వరకు కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో రాష్ట్రస్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న దీపారాధన

ఎల్లారెడ్డిపేట, నవంబరు19(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో బుధవారం రాత్రి నిర్వహించిన దీపారాధన ఆకట్టుకుంది. మహిళలు వివిధ ఆకృతుల్లో భక్తిశ్రద్ధల నడుమ దీపాలను అలంకరించారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

బోయినపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. మండలంలో బుధవారం జరిగిన వివిధ కార్యక్రమంలో మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. సందర్భంగా మిడ్ మానేరు జలాశయంలో స్థానిక నాయకులతో చేపపిల్లలను వదిలారు. అనంతరం స్వచ్ఛ భారత్ స్కీమ్ భాగంగా నీలోజీపల్లిలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ టాయిలెట్స్‌ను ప్రారంభించారు. బోయినపల్లిలోని అంగన్‌వాడీ చిన్నారులకు దుస్తుల పంపిణీ చేసి రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్, షాదీముబారక్ చెక్కులను, అలాగే రైతుబీమా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో భాగంగా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా ముందుకు వెళ్తున్నారన్నారు. గత ప్రభుత్వం చేపట్టిన పథకాలను కొనసాగిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలనలో భాగంగా ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నామన్నారు. అనంతరం ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఫిషరీస్ ఆఫీసర్ సౌజన్య, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఎంపీడీవో జయశీల, స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ సురేష్, ఎంపీవో శ్రీధర్, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, సెస్‌డైరెక్టర్ కొట్టెపల్లి సుధాకర్, ఉమ్మడి జిల్లా మాజీ డీసీఎంఎస్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, బీజీ సెల్‌అధ్యక్షుడు కూస రవిందర్, నాయకులు వన్నెల రమణారెడ్డి, నాగుల వంశీ, నవీన్ యాదవ్‌లు పాల్గొన్నారు.

అపెరల్ పార్క్‌ను సందర్శించిన ఇన్‌చార్జి కలెక్టర్



అపెరల్ పార్క్‌లో పరిశ్రమల్లో మహిళలు పనితీరును పరిశీలించిన ఇన్‌చార్జి కలెక్టర్

సిరిసిల్ల రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులోని అపెరల్ పార్క్‌ను బుధవారం ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్ సందర్శించారు. పార్క్‌లో ఏర్పాటు చేసిన గ్రీన్ నీడిల్, టెక్స్‌పోర్ట్ పరిశ్రమలను సందర్శించి ఆయాపరిశ్రమల్లో వస్త్రాల తయారీ దశలను మొత్తం పరిశీలించారు. ఎక్కడి ఎగుమతిచేస్తారో వివరాలను నిర్వాహకులను అడిగితెలుసుకున్నారు. ఆయా పరిశ్రమల్లో పనిచేస్తున్న మహిళా కార్మికులతో మాట్లాడారు. ఎంత మంది పనిచేస్తున్నారు.. ఎక్కడి నుంచి వస్తున్నారు.. ఎన్నిగంటలు పని చేస్తారు.. ఎంత వేతనం ఇస్తున్నారనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అపెరల్ పార్క్‌లో నిర్మించిన వీవింగ్ షెడ్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళీశాఖ ఏడీ రాఘవరావు, తహసీల్దార్ మహేష్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

రేపు చెకుముకి టాలెంట్ టెస్టులు

- జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సంపత్‌కుమార్

సిరిసిల్ల టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలోని 13 మండలాల్లో ఈనెల 21న మండలాల స్థాయిలో చెకుముకి టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నామని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సిలివేరి సంపత్‌కుమార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జన విజ్ఞాన వేదిక 36 ఏళ్లుగా అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత శక్తిని, తార్కిక ఆలోచనను, ప్రశ్నించే విధానాన్ని, శాస్త్రీయ స్వభావాన్ని పెంపొందిస్తుందన్నారు. దీనిలో భాగంగా ఈనెల 21న మండల స్థాయిల్లో చెకుముకి టాలెంట్ టెస్టులను నిర్వహిస్తున్నామని, వివరాలకు తమను సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పారం లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు ద్యావపెల్లి శ్రీహరి పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో చీరలు పంపిణీ చేయాలి

- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా పండుగ వాతావరణంలో ఇందిరా మహిళా శక్తి చీరలను అర్హులైన మహిళలందరికి పంపిణీ చేయాలని కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ సచివాలయం నుంచి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, సీతక్క, వాకిటి శ్రీహరి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, చేనేత జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలాజ రామయ్యర్‌లో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్, జిల్లా అధికారులతో చీరల పంపిణీపై చర్చించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ భారత మాజీ ప్రధాన మంత్రి ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని జిల్లాలోని మహిళలందరికి ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లావ్యాప్తంగా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసి అర్హులైన మహిళలందరికి అందించేందు తగిన ప్రణాళికలను రూపొందించుకుని పంపిణీ చేయాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ఆడపడుచులందరికి చీరలను అందించాలన్నారు. మహిళా సమాఖ్య సభ్యులకు ఈ చీరల వల్ల ఆత్మగౌరం పెరుగుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గాల వారిగా ప్రత్యేక అధికారులను నియమించి చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టలన్నారు. అధికారులను, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలన్నారు. మహిళ అభ్యున్నతి ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం ధృడ సంకల్పంతో పనిచేస్తుందని సీఎం అన్నారు. మహిళలకు వడ్డీలేనిరుణాలు, ఇచ్చి వారిని పోత్సహిస్తుందని వివరించారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌లు, పెట్రోల్ బంక్‌లు, అమ్మ అదర్శపాఠశాలల పనులు, సోలార్ ప్లాంట్‌ల నిర్వహణతోపాటు అనేక రంగాల్లో మహిళలను ప్రోత్సహిస్తున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడమే కాకుండా వారిని బస్సులకు యాజమానులు చేయడానికి అద్దె బస్సులు కేటాయిస్తున్నామని చెప్పారు. 2034 సంవత్సరానికి కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం ప్రకటించారు.

జిల్లా వ్యాప్తంగా చీరల పంపిణీ ప్రణాళికలు

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీకి పకడ్బందీగా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తామని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్ తెలిపారు. నియోజకవర్గానికి, మండలానికి, గ్రామాలకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రం నుంచి అన్ని మండలాలకు చీరలను తరలించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా మహిళలకు చీరలను అందించాలని కోరారు. ఈ వీడియో కానరెన్స్‌లో డీఆర్‌డీవో శేషాద్రి, అడిషనల్ డీఆర్‌డీవో శ్రీనివాస్, చేనేత జౌళీశాఖ ఏడీ రాఘవరావు, డీపీవో షర్ఫొద్దున్, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్ ఖదీర్‌పాషా, వేములవాడ మున్సిపల్ మేనేజర్ సంపత్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, మెప్మ ఏవో మీర్జా ఫసహత్ అలీబేగ్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ప్రభుత్వ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కబడ్డీ శిక్షణ శిబిరాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో రాణించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రం మినీ స్టేడి యంలో కబడ్డీ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో జూనియర్స్ కబడ్డీ బాలబాలికలకు శిక్షణ శిబిరాన్ని, ప్రభుత్వం అందించిన కబడ్డీ మ్యాట్స్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వంలో ఉన్నాం కాబట్టి ప్రభుత్వం, మంత్రుల సహకారంతో రాష్ట్రస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించుకుందామన్నారు. గ్రామీణ క్రీడలైన కబడ్డీ, వాలీబాల్ పోటీలకు జిల్లాలో ఆదరణ ఉందన్నారు. క్రీడాకా రులకు ప్రభుత్వం తరపున తగిన సౌకర్యాలను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామన్నారు. క్రీడా శాఖ మంత్రి శ్రీహరి, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి గ్రామీణ క్రీడలతో పాటు ఆధునిక క్రీడాలపై ప్రోత్సాహాన్ని ఇస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రం నుంచి క్రీడాకారులను తయారు చేయాలని, క్రీడా రంగాన్ని ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పోర్ట్స్ యూనివర్శిటీని కూడా ఏర్పాటు చేస్తున్నారన్నారు. క్రికెట్ ప్రేమికులు, క్రీడాకారులు కోరిక మేర ప్రభుత్వ సహకారంతో ఇటీవల జిల్లా కేంద్రంలో క్రికెట్ క్రీడా మైదానం కేటాయించామన్నారు. అనంతరం కబడ్డీ అసోసియేషన్ నాయకులు ఆది శ్రీనివాస్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, టీపీసీసీ కో ఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్లు ఆడెపు చంద్రకళ, ఆడెపు ప్రభాకార్, కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శి తిరుపతి, సిరిసిల్ల మండల అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణ, వ్యాయామ ఉపాధ్యాయులు, శిక్షకులు పాల్గొన్నారు.

రైల్వే లైన్ పనులు త్వరగా పూర్తి చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కొత్తపల్లి -మనోహరాబాద్ రైల్వేలైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని క్యాబినెట్ సెక్రటేరియట్ కో-అర్డినేటర్ ఆదేశించారు. సిరిసిల్ల సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఢిల్లీ నుంచి క్యాబినెట్ సెక్రటేరియట్ కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ పనులు, భూసేకరణ, ఇతర అంశాలపై సమీక్షించారు. కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వేలైన్ జిల్లాలో 40 కిలోమీటర్లు మేర ఉందని, ఆ రైల్వే లైన్ నిర్మాణంలో భాగంగా భూసేకరణ, అటవీశాఖ అనుమతులతో ఇతర పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేస్తామని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగ్రవాల్ వివరించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీవో వెంకటేశ్వర్లు, వేములవాడ ఆర్డీవో రాధాబాయి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ హనుమంతు, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సెస్ కార్యాలయంలో కొనసాగిన తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

సిరిసిల్ల రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘంలో రెండో రోజు బుధవారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేసి పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. సెస్‌లో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ఇటీవల పలువురు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్ నుంచి విజిలెన్స్ సీఐ అనిల్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, విజిలెన్స్ ఏఈ శ్రీకాంత్‌గౌడ్ బృందాలతో సెస్ కార్యాలయానికి చేరుకుని ఆర్థిక లావాదేవీల రికార్డులతో పాటు కంప్యూటర్‌లలో ఉన్న వివరాలను పరిశీలించారు. రికార్డులను తమ వెంట తీసుకెళ్లారు. ఫిర్యాదులకు సంబంధించిన పూర్తి వివరాలతో పాటు రికార్డులు లేకపోవడంతో బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్ మరోసారి కార్యాలయానికి వచ్చి అవసరమైన వాటిని సీజ్ చేసి తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఎల్లారెడ్డిపేట, నవంబరు19(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామశివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి బుధవారం తెలిపారు. మండలంలోని రాచర్లగొల్లపల్లి గ్రామానికి చెందిన అందె చంద్రయ్య ఈ నెల 18న తన కారులో పనినిమిత్తం సిరిసిల్లకు వెళ్లి అదేరోజు రాత్రి తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో హరిదాస్‌నగర్ గ్రామ శివారులో గుర్తు తెలియని లారీ అతివేగంగా చంద్రయ్య కారును ఢీకొట్టిందని చెప్పారు. ప్రమాదంలో కారు ముందు భాగం ధ్వంసమైందని పేర్కొన్నారు. కారులో ప్రయాణిస్తున్న చంద్రయ్యకు గాయాలు కాలేదని తెలిపారు. బాధితుడు చంద్రయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

ముత్తారం, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఓరుగంటి రవీందర్‌రావు ఇంట్లో గుర్తు తెలియని దొంగలు మంగళవారం అర్ధరాత్రి చొరబడ్డారు. ప్రస్తుతం రవీందర్‌రావు హన్మకొండలో నివాసముంటుండగా, వారం రోజులకు ఒకసారి ఇక్కడికి వచ్చి వెళ్తుంటాడు. రోజూ తాళం వేసి ఉండటాన్ని గమనించిన దొంగలు ఇదే అదునుగా భావించి తాళం పగలగొట్టి ఇంట్లో చొరబడి విలువైన వస్తువుల కోసం వెతికారు. ఈ క్రమంలో అంతా చిందవందరగా పడేశారు. అయితే విలువైన వస్తువులేమీ దొరకకపోవడంతో దొంగలు వెనుదిగారు. మరుసటి రోజు బుధవారం ఇంట్లో పనిచేసే పనిమనిషి ఇంటికి వచ్చి తాళం పగిలి ఉండటాన్ని గుర్తించి, పక్కనే ఉన్న రవీందర్‌రావు బంధువులకు తెలిపారు. దీంతో వారు రవీందర్‌రావుకు, ముత్తారం పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ముత్తారం పోలీసులు.. క్లూస్ టీంతో అక్కడికి చేరుకొని ఆధారాలను సేకరించారు. రవీందర్‌రావు అందుబాటులో లేకపోవడంతో అతని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ముత్తారం ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

జగిత్యాలరూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం ఒడ్డెరకాలనీకి చెందిన కందిరాజు(32) అనే యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు జగిత్యాల రూరల్ ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. రాజు కొన్ని రోజులుగా చెడు కలలు వస్తున్నాయని భయపడుతుండేవాడు. ఈ క్రమంలోనే బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధుడి మృతి

జగిత్యాల టౌన్ నవంబర్, 19 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనం ఢీకొని జగిత్యాల పట్టణంలోని అయ్యప్ప కాలనీకి చెందిన పిప్పరి కిషన్ (78) అనే వృద్ధుడు మృతిచెందాడు. ఉదయం కూరగాయాల మార్కెట్‌కు వెళ్లేందుకు కరీంనగర్ డెయిరీ సమీపంలో ఆటో కోసం వేచి చూస్తున్నాడు. ఈ క్రమంలో దరూర్ వైపు నుంచి వస్తున్న ద్విచక్రవాహనం పిప్పరి కిషన్‌ను ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కిషన్ మృతిచెందాడు. కుమారుడు పిప్పరి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ సీఐ కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి



రాజ్‌కుమార్(ఫైల్)

సారంగాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన శివరాత్రి రాజ్‌కుమార్ (21) అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ బుధవారం హైదరాబాద్ ఆసుపత్రిలో మృతిచెందాడు. రాజ్‌కుమార్ ఈనెల 16న రాజ్‌కుమార్ తన మిత్రుడు సూర రాజుతో కలిసి ఓ శుభకార్యానికి ద్విచక్ర వాహనంపై గొల్లపల్లి మండలం చిల్వకోడూర్ గ్రామానికి వెళ్ళి వస్తుండగా కారు ఢీకొంది. రాజ్‌కుమార్ తలకు బలమైన గాయం కావడం పరిస్థితి విషమించడంతో చికిత్స నిమిత్తం హైదారాబాద్ తరలించగా బుధవారం మృతి చెందాడు.



జాతీయ ప్లాట్ ఫాం.. మై స్కీం

● ఒకే గొడుగు కిందకు ప్రభుత్వ పథకాలు

చొప్పదండి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ ఇండియాలో భాగంగా వ్యవసాయం, విద్య, వైద్యం, బ్యాంకింగ్, సబ్సిడీ రుణాలు, పీఎంఈజీపీ లాంటి 4,330 పథకాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చింది కేంద్ర ప్రభుత్వం. అర చేతిలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ఈ సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. లబ్ధిదారులు పథకాల కోసం వెతకకుండా ఒకే సైట్‌లో అన్ని పథకాలను కేంద్రం చేర్చింది. నేషనల్ ఈ గవర్నెన్స్ డివిజన్ అభివృద్ధి చేసి నిర్వహిస్తున్న మై స్కీం దేశంలోనే జాతీయ ప్లాట్‌ఫారంగా పేరొందింది. కేంద్ర ఐటీ మంత్రిత్వ శాఖ, రాష్ట్రాల భాగస్వామ్యాన్ని ఈ ప్లాట్‌ఫారాన్ని నిర్వహిస్తున్నారు. నిరుపేద, నిరుద్యోగ యువతకు ఈ సైట్ ఎంతగానో ఉపయోగపడుతుంది.

● మై స్కీంలో 4,330 పథకాలు..

జాతీయ ప్లాట్‌ఫాం మై స్కీంలో కేంద్ర ప్రభుత్వం, అన్ని రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సైట్‌లో చేర్చారు. కేంద్ర ప్రభుత్వంలోని 590 పథకాలు, దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 3,740 పథకాలను మై స్కీం సైట్‌లో పొందుపర్చారు. లబ్ధిదారులు తమకు కావాల్సిన పథకాన్ని ఈ సైట్‌లో ఎంచుకుని దరఖాస్తు చేసుకోవచ్చు. 15 రంగాలకు సంబంధించిన పథకాలను ఇందులో చేర్చారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించిన 718 పథకాలు, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ 293, విద్య 1,068, బిజినెస్ 622, వైద్యరంగం 255, గృహ నిర్మాణం 118, న్యాయ, ప్రజారక్షణకు సంబంధించిన 27 పథకాలు ఈ ప్లాట్‌ఫాంలో ఉన్నాయి. ఐటీ కమ్యూనికేషన్స్ 96, స్కిల్ ఎంప్లాయిమెంట్ 350, సాంఘిక సంక్షేమ సాధికారత 1,447, క్రీడలు, సాంస్కృతిక విభాగం 247, రవాణా, మౌళిక సదుపాయాలు 77, టూరిజం 67, పారిశుద్యం 48, స్త్రీ, శిశు సంక్షేమానికి సంబంధించిన 437 పథకాలు మై స్కీం సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. పీఎంఈజీపీ లాంటి సబ్సిడీ రుణాలు, వ్యవసాయ రంగానికి సంబంధించిన సబ్సిడీ పథకాలు అనేకంగా ఈ సైట్‌లో అందుబాటులో ఉన్నా యి. ఒకే గొడుగు కిందకు వేలాది పథ కాలు అందుబాటులో ఉండగా లబ్దిదా రులకు అరచేతిలోనే సంపూర్ణ సమాచారం దొరుకుతుంది.

● పథకాన్ని ఎంచుకోవడం ఇలా...

గూగుల్‌లోకి వెళ్లి www.myscheme.gov.in లోకి వెళ్లగానే స్కీంల వివరాలు వస్తాయి. మీ కోసం స్కీం అనే ట్యాగ్‌లైన్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేయగానే మీ గురించి వివరాలు నింపాలి. పూర్తి సమాచారాన్ని నమోదు చేసిన తర్వాత మీ అర్హతను, వివరాలను బట్టి మీకు అందుబాటులో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు కనిపిస్తాయి. వీటిని క్లిక్ చేయగానే వందలాది పథకాలు మీకు తెలిసిపోతాయి. పథకం వివరాలు, విషయాలు, అర్హత చూసుకుని మీరు ఎంచుకున్న పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు.

సౌదీలో హన్మాజిపల్లివాసి మృతి



వీరయ్య (ఫైల్)

గన్నేరువరం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బతుకుదెరువు కోసం సౌదీ అరేబియాకు వెళ్లిన మండలంలోని హన్మాజిపల్లికి చెందిన వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని హన్మాజిపల్లికి చెందిన పారునంది వీరయ్య(44) ఉపాధి కోసం పది నెలల క్రితం సౌదీ వెళ్లాడు. అక్కడ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం ఉదయం కారులోనే గుండెపోటుతో మృతి చెందాడు. వీరయ్యకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురావడానికి ప్రభుత్వం సహాయం చేయాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



రాములు(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లోని వ్యక్తి లంబ రాములు(51) ఈనెల 18న పురుగుల మందు తాగి బలవన్మరణానికి ఒడిగట్టాడని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఆయన, కుటుంబీకుల కథనం మేరకు.. గ్రామంలోని రైతు లంబ రాములు వ్యవసాయం చేయడంతో పాటు పాల వ్యాపారం చేస్తూ కుటుంబీకులను పోషిస్తుండేవాడు. యేడాది కిందట మానసిక స్థితి బాగులేక ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. తిరిగి కొన్ని రోజులకు ఇంటికి చేరుకున్న ఆయన గత నెల పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కోలుకున్న ఆయన ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈనెల 18న ఇంటిలో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య లక్ష్మీ, కొడుకులు వేణు, జోసెఫ్, కూతురు పుష్పలత ఉన్నారు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

సైబర్ నేరగాళ్లకి సహకరిస్తున్న ఒకరి అరెస్ట్

విశాఖపట్నం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్ట్, క్రిప్టో ట్రేడింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, టాస్క్‌బేస్డ్ పార్ట్‌టైం జాబ్స్, వాట్సాప్ ఇంఫ్రోసొనేషన్ స్కామ్ బాధితుల నుంచి సైబర్ మోసం ద్వారా కొల్లగొట్టిన డబ్బులను మ్యూల్ అకౌంట్లతో విత్ డ్రా చేసి వాటిని సైబర్ నేరగాళ్లకు క్రిప్టో కరెన్సీగా మార్చి అందించిన తెలంగాణలోని జగిత్యాల జిల్లా వ్యక్తిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. విశాఖ నగరానికి చెందిన వ్యక్తికి ఒక నెంబర్ నుంచి వాట్సాప్ మెసేజ్ వచ్చింది. స్నేహితుడినంటూ నమ్మించి ప్రస్తుతం డబ్బులు అవసరమని చెప్పి మూడు అకౌంట్లలోకి కోటి రూపాయల వరకు బదిలీ చేయించుకున్నారు. మోసపోయినట్లు గుర్తించి నేషనల్ సైబర్ క్రైం పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. వారు సమగ్ర దర్యాప్తు చేయగా తెలంగాణలోని జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలానికి చెందిన లక్కుల మనోజ్ అకౌంట్ల నుంచి క్రిప్టో కరెన్సీగా మార్చి సైబర్ నేరగాళ్లకి అందించినట్లు గుర్తించి సైబర్ క్రైం పోలీసులు అతడిని అరెస్ట్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇంజనీరింగ్ విద్యార్థి మృతి



సిద్దార్థ్ (ఫైల్)

శంషాబాద్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి మృతిచెందిన సంఘటన బుధవారం రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం, దొంతపూర్ గ్రామానికి చెందిన రామటెంకి సిద్దార్థ్ (22) మండల పరిధిలోని కాచారం వర్ధమాన్ ఇంజనీరింగ్ కళాశాలలో నాల్గవ సంవత్సరం చదువుతున్నాడు. మంగళవారం తన స్నేహితుడు రోహిత్‌తో కలిసి బైకుపై సాయంత్రం 6.30 గంటలకు కళాశాల వైపు వెళ్తున్నాడు. నర్కూడ దాటిన తరువాత చాయ్ దునియా హోటల్ సమీపంలో మల్కారం నుంచి వస్తున్న ఆటో ట్రాలీ వీరి వాహనాన్ని ఢీకొంది. ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన వాహనాదారులు గాయపడిన వారిని శంషాబాద్ ట్రైడెంట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న సిద్దార్థ్ రాత్రి 9 గంటలకు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. కుటుంబ సభ్యులను ఓదార్చడం ఎవరి తరం కాలేదు. కొడుకు మృతి తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోయారు. పోలీసులు గాంధీ ఆస్పత్రిలో మృతదేహనికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. బైక్‌పై ఉన్న మరో విద్యార్థికి తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదానికి కారణమైన ఆటోను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సీఐ నరేందర్‌రెడ్డి తెలిపారు.

గాలిపల్లిలో ఎలుగుబంటి సంచారం

ఇల్లంతకుంట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాలిపల్లి గ్రామ సమీపంలో మరోసారి ఎలుగుబంటి సంచరించిందని గ్రామస్థులు తెలిపారు. గ్రామసమీపంలోని వరదకాలువ కట్టపై బుధవారం ఉండగా పలువురు గమనించారు. పదిరోజుల క్రితం గాలిపల్లి సమీపంలోని ఎస్సీ బాలుర హాస్టల్ సమీపంలో రైతులకు ఎలుగుబంటి కనిపించింది. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు స్పందించాలని రైతులు కోరుతున్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరికి గాయాలు

పెద్దపల్లి రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పన్నపేట గ్రామం వద్ద రాజీవ్‌రహదారిపై ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడటంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం మండలం బొట్లవనపర్తి గ్రామానికి చెందిన నర్సయ్య గోదావరిఖని నుంచి సొంత గ్రామానికి వెళ్తున్న క్రమంలో అప్పన్నపేట వద్ద బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో గాయాలు కాగా అతడిని స్థానికులు పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు.

కల్వచర్లలో చోరీ

రామగిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్లలో కొంత బాపు అనే రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగింది. తాళం వేసి ఉన్న బాపు కుటుంబం రెండు రోజుల క్రితం ఆసుపత్రికి వెళ్లారు. కాగ బుధవారం తలుపులు తెరిసి ఉండడంతో దొంగలు పడ్డట్లుగా స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దొంగలు ఇంటి గడియ విరగగొట్టి లోనికి ప్రవేశించారు. ఇంట్లో గల రూ.15వేల వరకు చోరీ చేసినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఏఎస్ఐ స్వామి ఆధ్వర్యంలో డాగ్‌స్క్వాడ్, ఫోరెన్సిక్ నిపుణులు పరిశీలన జరిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బొమ్మకల్ శివారులో ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు, మానకొండూర్‌కు చెందిన డ్రైవర్ సయ్యద్ మీర్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్‌జీ ఎక్కడ?

● పోలీసుల అదుపులో ఉన్నాడనే ప్రచారం

● ఆందోళనలో కుటుంబ సభ్యులు



దేవ్‌జీ సోదరుడు గంగాధర్, సోదరుడి కూతురు సుమ

కోరుట్ల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్‌జీ అలియాస్ తిప్పరి తిరుపతి ఆంధ్రప్రదేశ్ పోలీసుల అదుపులో ఉన్నాడన్న సోషల్ మీడియా ప్రచారంతో జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన ఆయన కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇటీవల మావోయిస్టు అగ్ర నాయకుడు, కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మా మృతి చెందారు. ఇదే సమయంలో మావోయిస్టు కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్‌జీ అలియాస్ తిప్పరి తిరుపతిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారన్న వార్త సోషల్ మీడియాలో వైరల్ అయింది. దేవ్‌జీ ప్రొటెక్షన్ టీంలోని తొమ్మిది మంది సభ్యులను పోలీసులు అరెస్టు చేసినట్లు వస్తున్న వార్తలతో ఆయన కుటుంబ సభ్యుల్లో ఆందోళన నెలకొంది. 1980లో కోరుట్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసిన తిరుపతి ఆర్ఎస్‌యూలో కీలక కార్యకర్తగా పని చేశారు. 1983లో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతూ పీపుల్స్‌వార్ పార్టీలో చేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. పార్టీలో వివిధ అగ్ర నాయకత్వంలో పని చేసి కేంద్ర కార్యదర్శిగా 40 రోజుల క్రితం నియమితుడయ్యాడు. దేవ్‌జీ నియమితుడైనప్పటి నుంచి చోటు చేసుకున్నుంటున్న పరిణామాలకు తోడు వరుస ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో ఆయన బంధువులు ఆందోళనకు గురవుతున్నారు.

● అరెస్ట్ చేస్తే కోర్టులో హాజరు పరచాలి

- తిరుపతి సోదరుడు గంగాధర్, సోదరుడి కుమార్తె సుమ

కేంద్ర కమిటీ కార్యదర్శి, పార్టీ అగ్రనాయుడు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్‌జీని పోలీసులు అరెస్టు చేస్తే కోర్టులో హాజరు పరచాలని ఆయన తమ్ముడు తిప్పిరి గంగాధర్, తమ్ముడి కుమార్తె సుమలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. పెద్ద నాన్న లొంగిపో అని గతంలో రెండుసార్లు తిప్పిరి తిరుపతి తమ్ముడి కూతురు సుమ సామాజిక మాధ్యమాల ద్వారా విజ్ఞప్తి చేశారు. దేవ్‌జీ క్షేమ సమాచారంపై ఆయన తమ్ముడు, తమ్ముడి కూతురు మరోమారు సామాజిక మాధ్యమాల ద్వారా దేవ్‌జీని కోర్టులో హాజరు పరచాలని పోలీసులను కోరారు.

ఈ నెల 26న కార్మిక సంఘాల ధర్నా

హుజూరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గీట్ల ముకుందారెడ్డి అన్నారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో కొప్పుల శంకర్ అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క పక్క దేశంలో రైతు నల్ల వ్యతిరేక చట్టాలను తీసుకొస్తూ వ్యవసాయాన్ని మొత్తం కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పే కుట్ర చేస్తుందన్నారు. పెట్టుబడిదారులకు శ్రమ దోపిడికి గురిచేసే విధంగా కార్మిక చట్టాల సవరణ పేరుతో కార్మికుల పొట్టగొడుతుందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా అఖిల భారత స్థాయిలో జరుగుతున్న ఐక్య పోరాటాలల్లో భాగంగా ఈ నెల 26న జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. ప్రజా అనుకూల విధానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గుండేటి వాసుదేవ్, ఎడ్ల రమేష్, రాజేశం, కొంకట చంద్రయ్య, సారయ్య, కుమార్, రత్నాకర్, మహేష్ ఉన్నారు.

సైడ్ ఇవ్వలేదని ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి

● ఖండించిన మంత్రి పొన్నం ప్రభాకర్



ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేస్తున్న కారు యజమాని

ఇల్లంతకుంట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సైడ్ ఇవ్వలేదని ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేశాడు ఓ కారు యజమాని. సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ వెళ్లి ఇల్లంతకుంట మీదుగా సిరిసిల్లకు వెళుతోంది. రాజన్న సిరిసిల్ల జిల్లా వల్లంపట్ల గ్రామ సమీపంలోని సందోరిపల్లి వద్ద ఆర్టీసీ బస్సు వెనుకాల ఓ కారు వచ్చింది. రోడ్డు ఇరుకుగా ఉండటం వల్ల డ్రైవర్ సైడ్ ఇవ్వలేదు. దీంతో విచక్షణ కోల్పోయిన సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం గంగాపూర్‌కు చెందిన పిట్టల శ్రీకాంత్ అనే కారు యజమాని ఆర్టీసీ డ్రైవర్ బాలరాజుపై విచక్షణా రహితంగా దాడిచేశాడు. ఆర్టీసీ బస్సులోని మహిళలు వారించినా శ్రీకాంత్ వినలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు.

● స్పందించిన మంత్రి

ఇల్లంతకుంట మండలం వల్లంపట్ల గ్రామసమీపంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విధుల్లో ఉన్న ఆర్టీసీ ఉద్యోగిపై ఉద్దేశపూర్వకంగా దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. ప్రజా రవాణా వ్యవస్థలో ప్రయాణికుల కోసం నిరంతరం శ్రమిస్తున్న ఆర్టీసీ డ్రైవర్లపై దాడిని ఉపేక్షించేది లేదని మంత్రి హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. దాడిచేసిన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఎస్పీ మహేష్ బీ గితేను ఫోన్‌లో ఆదేశించారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న సీఐ నిరంజన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగునూరుకు చెందిన ఉరుసు నర్సయ్య అనే వ్యక్తి సెప్టెంబరు 29న సెల్‌ఫోన్‌ను అదే గ్రామంలో పోగొట్టుకుని కరీంనగర్ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా నిజామాబాద్‌లో ఉన్నట్లుగా గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బాధితుడిని బుధవారం రూరల్ స్టేషన్‌కు పిలిచి సీఐ నిరంజన్‌రెడ్డి చేతుల మీదుగా సెల్‌ఫోన్‌ను అప్పగించారు. సెల్‌ఫోన్ రికవరీలో కృషి చేసిన కానిస్టేబుల్ పద్మజ, విశ్వతేజను సీఐ అభినందించారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

● ప్రభుత్వ నిర్మాణాలకు అనుమతులు. ప్రైవేట్‌లో విక్రయాలు ● ఇబ్బందుల్లో ఇళ్ల యజమానులు



ఇసుక అనుమతి ఇస్తున్న రెవెన్యూ సిబ్బంది

వేములవాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మూలవాగు నుంచి యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ప్రభుత్వ నిర్మాణాల పేరుతో డీడీలు కట్టిన వ్యాపారులు ప్రభుత్వ నిర్మాణాలకు ఇసుకను తరలించకుండా డంపు చేసుకుంటున్నారు. రాత్రి సమయంలో గుట్టుచప్పుడు కాకుండా ప్రైవేటులో ఎక్కువ ధరకు విక్రయించుకుని సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. వేములవాడ పట్టణంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు డీడీలు తీసిన వ్యాపారులకు ఇసుక తీసుకునేందుకు అనుమతి ఇస్తున్నారు. బుధవారం మూలవాగు నుంచి ఇసుక తీసుకునేందుకు అనుమతినిచ్చారు. దీంతో ఇసుక వ్యాపారులు అదే అదనుగా ఇసుకను ఇందిరమ్మ ఇళ్లకు సరఫరా చేయకుండా మరోచోట డంపు చేసుకుంటున్నారు. ఒక్క డీడీపైన నాలుగు ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం. రెవెన్యూ అధికారులు మాత్రం ట్రాక్టర్‌లను పరిశీలించకుండానే తమకు నచ్చిన వారికి ఇసుక అనుమతి ఇస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఇళ్ల నిర్మాణానికి ఇబ్బందులు

వేములవాడ పట్టణంలో ఇళ్ల నిర్మాణానికి ఇసుక లేక యజమానులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అనుమతి ఇవ్వడం లేదని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంటి నిర్మాణం చేసుకునే వారికి రెవెన్యూ అధికారులు ఇంటికి వచ్చి పరిశీలించి ఇసుక పర్మిషన్ ఇవ్వాలని నూతన ఇంటి యజమానులు డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కథలాపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలం కలికోట సూరమ్మ చెరువు శివారులో వేములవాడ-కోరుట్ల రహదారిపై బుధవారం తెల్లవారుజామున లారీ బోల్తా పడింది. గుంటూరు జిల్లా పిడుగురాళ్ల నుంచి కోడి ఎరువు లోడ్‌తో వస్తుండగా ఒక్కసారిగా అదుపు తప్పి పక్కనే ఉన్న గుంతల్లో పడిపోయింది. ఈ ఘటనలో డ్రైవర్ సోనురాథోడ్ సహా క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రోడ్డుపై ఎవరూ లేక పోవడంతో ప్రమాదం తప్పింది.

రేపు కరీంనగర్‌లో ఖేలో ఇండియా పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శుక్రవారం ఖేలో ఇండియా అస్మిత అథ్లెటిక్స్ పోటీలను నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో ఈ పోటీలను అండర్-14, అండర్-16 విభాగాల్లో కేవలం బాలికలకు మాత్రమే నిర్వహించనున్నామని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షులు నందెల్లి మహిపాల్ తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనుటకు ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు పుట్టిన తేదీ ధ్రువీకరణ సర్టిఫికెట్ తీసుకొని హాజరుకావాలని సూచించారు. పోటీల్లో పాల్గొనేవారు ఎస్ఎస్ఆర్ఎస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఉండాలని సూచించారు. అండర్-14 బాలికల విభా గంలో ట్రైయ థ్లాన్ ఎ 60 మీటర్లు, లాంగ్ జంప్, హైజంప్ నిర్వహిస్తారు. అలాగే ట్రయా థ్లాన్ బి 60 మీటర్లు, లాంగ్ జంప్, బ్యాక్‌త్రో, వన్ కేజీ షార్ట్‌పుట్, ట్రయా థ్లాన్ సి 60 మీటర్లు, లాంగ్‌జంప్, 600 మీటర్ల కిడ్స్ జావెలిన్ ఉంటాయి.

అండర్-16 విభాగంలో..

60 మీటర్లు 600 మీటర్లు, హైజంప్, లాంగ్ జంప్, డిస్కస్‌త్రో, షార్ట్‌పుట్ 3 కేజీ, జావెలిన్ త్రోలలో పోటీలు నిర్వహించనున్నారు. పాల్గొనే క్రీడాకారులందూ ఉదయం 8 గంటలకు ఒరిజినల్ డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్‌లో ప్రాంతీయ క్రీడా పాఠశాలలో హాజరుకావాల్సి ఉంటుంది.

22న జూనియర్ వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా జూనియర్ బాలబాలికల వాలీబాల్ జట్ల ఎంపిక పోటీలను ఈ నెల 22న నిర్వహించనున్నారు. కొత్తపల్లి మండలం ఎలగంగల్‌లో పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ వేణుకిషన్‌రావు, గిన్నె లక్ష్మణ్ తెలిపారు. పోటీల్లో ప్రతిభచాటే క్రీడాకారులను ఈ నెల 29 నుంచి డిసెంబరు 2వ వరకు రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహించే తెలంగాణ రాష్ట్రస్థాయి జూనియర్ వాలీబాల్ పోటీలకు ఎంపిక చేయనున్నారు. జనవరి 1, 2008 తర్వాత జన్మించి 18 సంవత్సరాల్లోపు వయస్సు గల క్రీడాకారులు పోటీలకు అర్హులని పేర్కొన్నారు. క్రీడాకారులు ఆధార్ కార్డు, పదోతరగతి మెమో, జనన ధ్రువీకరణ పత్రంతో హాజరుకావాలని, వివరాలకు ఫోన్ : 8099546565, 790100546 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

- దెబ్బతిన్న వరి, పత్తి పంటలు
- దాదాపు వెయ్యి ఎకరాల్లో పంట నష్టం
- మిడ్‌మానేరు బ్యాక్ వాటర్‌తో రైతుల కష్టాలు

పంటపొలాలు నీళ్లపాలు


మిడ్‌మానేరు బ్యాక్ వాటర్‌లో మునిగిన వరి పంట

వేములవాడ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మిడ్‌మానేరు ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వల్ల చేతికి వచ్చే పంటపొలాలు నేలపాలయ్యాయి. పంట పొలాల్లోకి నీరు చేరి వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. ఆరుగాలం కష్టించి పండించిన పంట బ్యాక్ వాటర్ చేరి నేలపాలైంది. మిడ్‌మానేరు బ్యాక్ వాటర్ చేరి వరి, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో మధ్యమానేరు జలాశయంలో ముంపునకు గురైన గ్రామాల్లో దాదాపు 1000 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. పంటలు దెబ్బతినడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు.

● బఫర్‌జోన్ దాటి..

మిడ్‌మానేరు ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ బఫర్‌జోన్ దాటింది. ప్రధానంగా బఫర్‌జోన్, సీపేజి నిబంధనలు పాటించని కారణంగా దాదాపు 50మీటర్ల వరకు నీరు వచ్చి ప్రాజెక్టు ఆనుకొని ఉన్న పంట నేలపాలయింది. శ్రీరాజరాజేశ్వర మిడ్‌మానేరు ప్రాజెక్టును 27.87 టీఎంసీల కెపాసిటీతో నిర్మించారు. అయితే బఫర్‌జోన్ దాటి బ్యాక్‌వాటర్ రావడంతో పంటలు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంటలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో వేములవాడ అర్బన్ మండలంలోని ఆరేపల్లి, సంకెపల్లి, కొడుముంజ, రుద్రవరం, అనుపురం ముంపు గ్రామాలకు చెందిన రైతుల పంటపొలాల్లోకి నీరు చేరింది. వరి, పత్తి పంటలు నేలవాలిపోయి పంట చేతికందని పరిస్థితి ఏర్పడింది.


మిడ్ మానేరు బ్యాక్ వాటర్‌లో మునిగి దెబ్బతిన్న పత్తిపంట

కష్టపడి పండించిన పంట నేల పాలైంది..

- గుండెకార్ల లక్ష్మణ్, రైతు, ఆరెపల్లి



ఆరుగాలం కష్టపడి పండించిన పంట నేలపాలు కావడంతో తీవ్రంగా నష్టపోయాం. ఎకరం వరి వేశాను. పంట కోతకు వచ్చిన దశలో బ్యాక్ వాటర్‌చేరి నేలవాలింది. తమను ప్రభుత్వం ఆదుకోవాలి.

ఎస్సారార్ పీజీ ఫలితాలు విడుదల


ఫలితాలను విడుదల చేస్తున్న ఎస్ఆర్ఆర్ కళాశాల అధికారులు

గణేశ్‌నగర్,నవంబరు19(ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ అటనామస్ కళాశాల పీజీ రెండో, నాలుగో సెమిస్టర్ ఫలితాలను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ, ఎస్‌యూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ సురేష్, కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ తిరుకోవెల శ్రీనివాస్ బుధవారం విడుదల చేశారు. పీజీ రెండో సెమిస్టర్‌లో 250 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 193 మంది,77 శాతం, నాలుగో సెమిస్టర్‌లో 242 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 215 మంది 89 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ఫలితాలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ నితిన్ పాఠక్, రాజయ్య, టీజీసీజీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కడారు సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా ఎస్సారెస్పీ నీటిమట్టం

జగిత్యాల, నవంబరు 18 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి చేరుతున్న వరద, కాలువల ద్వారా కొనసాగుతున్న ఔట్ ఫ్లో సమానంగా ఉండడంతో ప్రాజెక్టు బుధవారం నీటి మట్టం నిలకడగా ఉంది. ఎగువ ప్రాంతం నుంచి ప్రాజెక్టులోకి 9,693 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి సరస్వతీ కాలువ ద్వారా 650 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి 8 వేల క్యూసె క్కులు, తాగు నీటి అవసరాల కోసం మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 812 క్యూసెక్కుల నీరు పోతోంది.

బీసీ రిజర్వేషన్ అమలును విస్మరిస్తే అసెంబ్లీ ముట్టడి


సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘాల నాయకులు

వేములవాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ అమలును విస్మరిస్తే అసెంబ్లీ ముట్టడిస్తామని బీసీ సాధికారత సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ డిమాండ్ చేశారు. వేములవాడ పట్టణంలోని బీసీ సాధికారిత సంఘ కార్యాలయంలో బుధవారం బీసీ ముఖ్య నేతలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పొలాస నరేందర్ మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో బీసీలకు స్థానిక ఎన్నికల్లో, విద్య ఉపాధి, ఉద్యోగాల్లో చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్‌లు ఇస్తామని వాగ్దానాలు చేశారని గుర్తుచేశారు. కోర్టులు, కేంద్రం అడ్డుపడుతున్నాయని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. పంచాయతీ ఎన్నికలు పార్టీ పర రిజర్వేషన్లతో ఎన్నికలు జరపాలని కేబినేట్లో తీసకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఈనెల 21వ తేది నుంచి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ప్రభుత్వం బీసీల పట్ల మొండిగా వ్యవహరిస్తే ఈనెల 21వ తేదిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాలకు వినతి పత్రాలు అందజేసి నిరసన వ్యక్తం చేస్తామని తెలిపారు. అంతేకాకుండా ఈనెల 23వ తేదిన అఖిలపక్షం ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తామని, 25వ తేదీన ధర్నా, రాస్తారోకో చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీసీ సాధికారిత సంఘం నేతలు తుపుకారి సత్తయ్య, ఇల్లందుల వెంకటేష్, ఉయ్యాల భూమయ్య, చింతలకోటి రామస్వామి, ముద్రకోల గణేష్, సుధాకర్, లింగయ్య, లక్ష్మీరాజం, ప్రభాకర్, భీంరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిధుల కోసమే పంచాయతీ ఎన్నికలు

● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్

హుజూరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, కేవలం కేంద్ర ప్రభుత్వ నిధుల కోసమే ఎన్నికలు నిర్వహిస్తోందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని మధువని గార్డెన్‌లో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి పోలింగ్ బూత్ అధ్యక్షులు, నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బండి సంజయ్‌కుమార్ మాట్లాడారు. ప్రధాని మోదీ సంక్షేమ పథకాలను అన్ని వర్గాలకు సమానంగా పంచుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ రెండేళ్లలో ఏ ఒక్క గ్రామపంచాయతీకైనా నయా పైసా ఇచ్చిందా? అని ప్రశ్నించారు. స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేయవద్దన్నారు. బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే పంచాయతీలు బాగుపడుతాయన్నారు. కేంద్రం నిధులతోనే రాష్ట్రంలో అభివృద్ధి జరుగుతుందన్నారు. తెలంగాణకు సీఐఆర్ఎఫ్ కింద రూ. 1200కోట్లు తీసుకువస్తే అందులో రూ.500కోట్లను కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి ఖర్చు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలన వైఫల్యాలను, బీఆర్ఎస్ పదేళ్ల వైఫల్యాలను వివరిస్తూ కరపత్రాన్ని రూపొందించామని, ఇది ఇం టింటికీ అందజేస్తామని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలు నరకయాతన పడ్డారని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజలు, రైతులు ఆత్మహత్యలు చేసుకునే స్థాయికి చేరారని అన్నారు. అనంతరం బండి సంజయ్‌కుమార్‌పై రూపొందించిన గీతాన్ని రాష్ట్ర సంఘటనా మంత్రి చంద్రశేఖర తివారీ విడుదల చేశారు. సమావేశంలో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, జిల్లా ఇన్ చార్జి గంగిడి మనోహర్‌రెడ్డి, జిల్లాల అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, రెడ్డబోయిన గోపి, మాజీ ఎమ్మెల్యే బొడిగే శోభ, మాజీ మేయర్ సునీల్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

రెన్యూవబుల్ ఎనర్జీలో ఎన్టీపీసీతో సింగరేణి ఒప్పందం

హైదరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పునరుద్ధాదక ఇంధన రంగంలో ఎన్టీపీసీ అనుబంధ కంపెనీ ఎన్‌జీఈఎల్ (ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్)తో సింగరేణి ఒక కీలక ఒప్పందం చేసుకుంది. బుధవారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ఇరు సంస్థల ప్రతినిధులు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గని వద్ద 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్, సోలార్ విద్యుత్‌ను 5 వేల మెగావాట్లకు పెంచాలని నిర్ణయించడం, మణుగూరు వద్ద జియో థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని యోచిస్తోందని, గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ కూడా నిర్మించాలన్న లక్ష్యంగా ముందుకు పోతున్నామని సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ ఈ సందర్భంగా చెప్పారు. ఈ నేపథ్యంలో విద్యుత్ ఉత్పత్తి రంగంలో అపార అనుభవం గల ఎన్టీపీసీ తోనూ అనుబంధ సంస్థ అయిన ఎన్ జి ఈ ఎల్ కంపెనీ తోనూ ఒప్పందం కుదుర్చుకోవడం ఒక శుభ పరిణామమన్నారు. సింగరేణి సహకారంతో గ్రీన్ ఎనర్జీ ప్లాంట్లను దేశవిదేశాల్లో ఏర్పాటు చేయనున్నామని, ఎన్టీపీసీ అనుబంధ సంస్థ ఎన్ జీ ఈ ఎల్ ఉన్నతాధికారి బిజినెస్ డెవలప్మెంట్ హెడ్ బిమల్ గోపాలాచారి అన్నారు. ఒప్పందం అనంతరం ప్రాజెక్టుల వారీగా సమీక్ష నిర్వహిస్తామని ఇరు పక్షాలకు లాభదాయకమైన ప్రాజెక్టులను ఎంపిక చేసి నిర్మాణం చేయడం జరుగుతుందన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

హుజూరాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని బీసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం హుజూరాబాద్ పట్టణంలోని బీఎస్ఆర్ గార్డెన్‌లో బీసీ జేఏసీ నాయకుల ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తాను ఇచ్చిన మాటను నటి మూటగా మార్చి బీసీలకు పాత రిజర్వేషన్ పద్ధతిని స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేస్తామని ఇటీవల క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారంలో వచ్చిన తర్వాత కామారెడ్డిలో డిక్లర్ చేసిన విధంగా బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ చట్టం ప్రకారం అమలు చేసిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జనార్ధన్, వెంకన్న, శ్రీనివాస్, సాగర్, సదానందం, శ్రీనివాస్, చంద్రశేఖర్, నారాయణ, శేఖర్, రాజేందర్, బాబు, రమేష్, బిక్షపతి, వెంకటేశ్వర్లు, రఘు, రవీందర్, సారయ్య పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలి


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ముందుండాలని, క్రీడలతో ఆత్మస్థయిర్యం పెంపొందుతుందని సిద్దిస్తుందని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం యువజన క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఖేలో ఇండియా అస్మిత కిక్ బాక్సింగ్ లీగ్ 2025-26 కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని విరూపాక్షి గార్డెన్‌లో బుధవారం నిర్వహించిన అండర్ 14 బాలబాలికలకు కిక్ బాక్సింగ్ రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల ప్రారంభోత్సవాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై..పోటీలను ప్రారంభించి తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలికల్లో చదువుతో పాటు క్రీడల ద్వారా ఆత్మస్థైర్యం పెంపొందించడానికి చేపట్టిన అస్మిత ఖేలో ఇండియా క్రీడలను బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి సహకరిస్తున్న క్రీడా కోచ్‌లను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిక్ బాక్సింగ్ అసోసియేషన్ ఛైర్మెన్ మంచాల కృష్ణ, నిత్య సాయి ట్రస్ట్ ఛైర్మెన్ డా.రఘు, కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి మహిపాల్, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఏవీఎల్ఎన్ చారి, వివిధ జిల్లాల కోచ్‌లతో పాటు, రెఫరీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

స్వగ్రామం చేరిన గల్ఫ్ మృతదేహం

రాయికల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సౌదీ రోడ్డు ప్రమాదంలో అసువులుబాసిన వలసజీవి మృతదేహం బుధవారం రాయికల్ పట్టణానికి చేరుకుంది. రాయికల్ పట్టణానికి చెందిన సుతారి ధర్మయ్య (48) ఇటీవల సౌదీ దేశంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ధర్మయ్య మృతితో కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయి తీవ్రంగా రోదిస్తున్నారు. ఉదయం స్వగ్రామానికి చేరుకున్న ధర్మయ్య శవపేటిక వద్ద కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీళ్లపర్యతమయ్యారు. అనంతరం అంత్యక్రియలు నిర్వహించారు. ధర్మయ్యకు భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. మృతదేహాన్ని రప్పించేందుకు అక్కడి సాటా రియాద్ శాఖ అధ్యక్షుడు మచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు తీవ్రంగా కృషి చేశారు.

కల్లులో మత్తు పదార్థాలు కలుపవద్దు


కల్లు శాంపిల్‌ను పరీక్షిస్తున్న అధికారులు

బీర్‌పూర్,నవంబరు 19(ఆంధ్రజ్యోతి):గ్రామాలలో ప్రజలు నిత్యం సేవించే తాటి కల్లు, ఈత కల్లులో మత్తు పదార్థాలు కలిపి ప్రజల ఆరోగ్యానికి హానికలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్పెషల్ ఎక్సైజ్ అధికారుల బృందం ఎస్సై ఎంఏ మాజీద్ అన్నారు. బుధవారం బీర్‌పూర్ మండలంలోని కొల్వాయి గ్రామంలో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా కల్లు మండువాలలో తాటి, ఈత కల్లు శాంపిల్ సేకరించి ప్రయోగాత్మకంగా పరీక్షలు నిర్వహించారు. సేకరించిన కల్లులో ఎలాంటి మత్తు పదార్థాలు లేవని నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్లు మహమ్మద్ గోరి, వినయ్, రజిత, కానిస్టేబుల్లు, గౌడ సంఘం అధ్యక్షులు గాజర్ల రామచంద్రం గౌడ్, గౌడ సంఘం కులుస్తులు తదితరులు పాల్గొన్నారు.

రాజన్న హుండీ ఆదాయం రూ. 2.03 కోట్లు

వేములవాడ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి హుండీ ద్వారా 2,03,25,676 రూపాయల ఆదాయం సమకూరింది. బుధవారం ఆలయ ఓపెన్ స్లాబ్‌లో భారీ భద్రత మధ్య 27 రోజుల హుండీలను లెక్కించారు. 228 గ్రాముల బంగారం, 14.3 కిలోల వెండి కానుకలు భక్తులు సమర్పించారు. ఈవో ఎల్ రమాదేవి, పరిశీలకులు రాజమౌళి పాల్గొన్నారు.

ఆర్టీసీ విలేజ్ బస్సు ఆఫీసర్లతో సమావేశం


ఆర్టీసీ విలేజ్ బస్సు ఆఫీసర్లను సన్మానిస్తున్న అధికారులు

భగత్‌నగర్, నవంబరు 19(ఆంధ్ర జ్యోతి): కరీంనగర్ రీజియన్ పరిధిలోని విలేజ్ బస్సు ఆఫీసర్లతో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ రాజు బుధవారం సమావేశం నిర్వహించారు. శబరిమలై, యాత్రాదానం, బస్ ఆన్ కాంట్రాక్టు విధానంలో బుక్ చేసిన బస్సుల వివరాలను సమీక్షించారు. రానున్న రోజుల్లో విలేజ్ బస్ ఆఫీసర్లు శబరిమలై, యాత్రాదానం, బస్ ఆన్ కాంట్రాక్టు పద్ధతిలో ఎక్కువ బస్సులు చేయించాలని, సంస్థకు అధిక ఆదాయం తీసుకు రావాలని సూచించారు. ప్రతి డిపోలో ఎక్కువ సంఖ్యలో ప్యాకేజీ టూర్లు, బస్ ఆన్ కాంట్రాక్టుపై బస్సు బుక్ చేసిన విలేజ్ ఆఫీసర్లను సన్మానించారు. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితంగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్ భూపతిరెడ్డి, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

చెప్పుకోలేని బాధ

● నేడు ప్రపంచ పైల్స్ దినోత్సవం

సుభాష్‌నగర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మొలలను ఇంగ్లీష్‌లో పైల్స్ లేదా హేమోరాయిడ్స్ అని అంటారు. ఇవి పైల్స్ అంటే మలద్వారం దగ్గర రక్తనాళాలు ఉబ్బి బయటకు పొడుచుకు వచ్చి ఉంటాయి. సమాజంలో దాదాపు 50 శాతం మంది పైల్స్‌తో బాధపడుతున్నట్లు వైద్య నిపుణులు తెలుపుతున్నారు. మాంసాహారం ఎక్కువ తీసుకోవడం, పండ్లు, కూరగాయలు తక్కువగా తీసుకోవడం, నీరు తక్కువ తాగడం, వ్యాయామం చేయకపోవడం, చాలా సమయం కూర్చుని పని చేయడం, మలవిసర్జన సమయంలో ఎక్కువగా కడుపులో ఒత్తిడి చేయడం, మల విసర్జన పద్ధతి ప్రకారం చేయకపోవడం, గర్భిణల్లో రక్తనాళాలపై ఒత్తిడి పడడం వంటి కారణాలతోపైల్స్ వచ్చే అవకాశం ఉంది.

● పైల్స్ వల్ల ఇబ్బందులు

పైల్స్ వచ్చిన వారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటారు. మల విసర్జన సమయంలో రక్తం పడుతుంది. మలద్వారం వద్ద వాపు ఏర్పడి నొప్పిగా దురదగా ఉంటుంది. రక్తనాళాల్లో రక్తం గడ్డ కడుతుంది. దీంతో కూర్చోవడానికి ఇబ్బందిగా ఉంటుంది. అప్పుడప్పుడు చీము గడ్డలు ఏర్పడి అధిక రక్తస్రావం అవుతుంది. తక్కువ తీవ్రత ఉంటే ఆహారపు అలవాట్లు, వ్యాయామం, మందులతో తగ్గించుకోవచ్చు. తీవ్రత ఎక్కువగా ఉంటే ఆపరేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది.



● అవగాహన కల్పించేందుకు ప్రపంచ పైల్స్‌దినోత్సవం

పైల్స్‌పై చాలామందికి అవగాహన లేకపోవడం వల్ల సకాలంలో వైద్యుడిని సంప్రదించడం లేదు. ప్రారంభ దశలోనే వాటిని గుర్తిస్తే మందులతోనే నయం చేయవచ్చు. పైల్స్ గురించి ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ప్రతి సంవత్సరం నవంబరు 20న ప్రపంచ పైల్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సంబంధిత ఆసుపత్రులు, డాక్టర్లు పలు కార్యక్రమాలను నిర్వహించిన ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

● సకాలంలో గుర్తిస్తే మందులతో నయం చేయవచ్చు

- డాక్టర్ సురేష్‌కుమార్, పైల్స్ అండ్ మోర్ క్లినిక్ కరీంనగర్



పైల్స్ వచ్చిన వారు మలవిసర్జనకు చాలా ఇబ్బందులు పడుతుంటారు. ఇది వచ్చిన వారు ప్రారంభంలో గుర్తించి డాక్టర్‌ను సంప్రదిస్తే ఆపరేషన్ అవసరం లేకుండా మందులతో నయం చేయవచ్చు. చాలా మంది వ్యాధి ముదిరిన తరువాత వస్తుంటారు. గతంతో పోలిస్తే ఇపుడు అత్యాధునిక చికిత్స అందుబాటులో ఉంది. లేజర్ ఇన్ ఫారెస్ట్, స్టెప్లర్ బ్యాండింగ్ పద్ధతులతో చికిత్స అందిస్తాం. ఆసుపత్రిలో చేరిన 24 గంటల్లో ఆపరేషన్ పూర్తి చేసి డిశ్చార్జ్ చేస్తాము. అతి తక్కువ సమయంలోనే వారు తమ పనులు చేసుకోవచ్చు. పేషంట్‌కు ఎలాంటి నొప్పి ఉండదు.

29వ రోజు గోదావరి హారతి


ధర్మపురి వద్ద గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు

ధర్మపురి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 29వ రోజు బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం ఆరంభం నుంచి జరిగే కార్యక్రమంలో భాగంగా ఆలయ వేదపండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి రాత్రి వరకు నదీ మాతకు హారతి ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి వేళలో భక్తులు, మహిళలు దొప్పలో దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలి పుణ్యప్రాప్తి పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, రాజగోపాల్, అర్చకులు నంబి అరుణ్‌కుమార్, వంశీకృష్ణ, అశ్విన్, అర్చకులు, ధర్మకర్తలు, శారదా మహిళా మండలి, వాసవి మహిళా మండలి సభ్యులు, కరీంనగర్ తిరుమల సేవా గ్రూపు సభ్యులు, పెద్దపల్లి శ్రీ వల్లి సేవా గ్రూపు సభ్యులు, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

కోనరావుపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం విడుదల చేసి, పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి జంగిటి రాజు కోరారు. కోనరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండమనేని మహేందర్‌రావు, కార్యదర్శి వంగ మల్లేశం, గాలిపల్లి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమోషన్ కల్పించాలని నల్ల బ్యాడ్జీలతో నిరసన

చందుర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వివిధ గ్రామాల్లో సెస్ పరిధిలో పనిచేస్తున్న అసిస్టెంట్ హెల్పర్లు ప్రమోషన్ కల్పించాలని నల్ల బ్యాడ్జీలతో బుధవారం నిరసన తెలిపారు. విధుల్లో భాగంగా మధ్యాహ్నం సమయంలో సెస్ కార్యాలయం ఎదుట నిసన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే హెల్పర్లుగా ప్రమోషన్ ఇవ్వాలని అసిస్టెంట్ హెల్పర్లు కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల అసిస్టెంట్ హెల్పర్లు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న అంజనేయరావు తదితరులు

ముస్తాబాద్, నవంబర్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గూడెంలో శివాలయ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. శివాలయ జీర్ణోద్ధారణ కార్యక్రమంలో భాగంగా పూనర్మిణ పనులకు భూమిపూజ చేశారు. ఆలయాలు మన సాంస్కృతిక సంప్రాదాయలని ఏఎంసీ మాజీ చైర్మన్ అంజనేయారావు పేర్కొన్నారు. ఆలయ అర్చకులు వెన్నెల రుద్రమణి, అధ్యక్షులు చిట్నేని అంజనేయరావు, కుంట రవి, బొప్ప దేవయ్య, శ్రీనివాస్‌రావు, బొప్ప విష్ణు, శ్రీధర్, గిరి, వెంకటరమణ, నర్సయ్య, అంజయ్య, వెంకన్న, ఎల్లం, రమేశ్, ఎల్లం, శంకర్, మల్లేశం, బాలయ్య, భూదయ్య, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

సెల్ పాయింట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రాము

వేములవాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణ సెల్ పాయింట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కోనమ్మగారి రామును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు. పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధానకార్యదర్శిగా పబ్బా ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా అంబటి మహేష్, నరేళ్ల సాయి, కోశాధికారిగా నాగుల వెంకటేశం సంయుక్త కార్యదర్శులుగా తాటికొండ శ్రీనివాస్, చేపూరి ప్రణవ్, సాధిక్, బత్తిని సంతోష్‌లు కార్యవర్గ సభ్యులుగా తిరుపతి, సంతోష్, సాయి, సురేందర్, షఫీ, రాజు సలహాదారులుగా మంచాల శ్రీనివాస్, సరిపురం శ్రీనివాస్, మల్లేశంలను ఎన్నుకున్నట్లు తెలిపారు.

ఘనంగా మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి



సిరిసిల్లలో ఇందిరమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



వేములవాడలో నివాళులర్పిస్తున్న నాయకులు



రుద్రంగిలో నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం సిరిసిల్ల పట్టణం గాంధీచౌక్ వద్ద ఇందిరా గాంధీ చిత్రపటానికి నాయకులు పూలతో నివాళులర్పించారు. అనంతరం స్వీట్లను పంపిణీ చేశారు. సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఉపాధ్యక్షుడు బొప్ప దేవయ్య, టీపీసీసీ కోఆర్డినేటర్ సంగీతం శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, చేనేత సెల్ జిల్లా అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ నీలి రవీందర్, మాజీ కౌన్సిలర్లు యెల్లె లక్ష్మీనారాయణ, ఆడెపు చంద్రకళ, ఆడెపు ప్రభాకర్, రాగుల జగన్, నాయకులు రాపెల్లి కళ్యాన్, గుజ్జె రమేష్, అన్నల్‌దాస్ భాను, లక్ష్మన్, చందన పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలకేంద్రంలోని బస్టాండు ప్రాంతంలో ఇందిరాగాంధీ విగ్రహానికి పులమాలలువేసి నివాళులు అర్పించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి బాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, మండల ఉపాధ్యక్షుడు ఎలుక రామస్వామి, ఏఎమ్‌సీ డైరెక్టర్ రాజేశం, స్పోర్ట్స్‌క్లబ్ అధ్యక్షుడు మామిడి రాజు, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్రోజు సంతోష్‌కుమార్, పట్టణశాఖ అధ్యక్షుడు మామిడి నరేష్, నాయకులు ఒగ్గు రమేష్, నీలం అంజయ్య, గొడుగు నర్సయ్య, రవీందర్‌రెడ్డి, సత్తిరెడ్డి, తిరుపతిరెడ్డి, ఒగ్గు మధు, ఎంద్ర నరేష్, దాసరి శివరాం తదితరులు పాల్గొన్నారు.

●ముస్తాబాద్ : మండల కేంద్రంలోని రాజీవ్ కూడలిలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన కూడలిలో ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎంసీ చైర్మన్ తలారి రాణినర్సింలు, కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు కొండం రాజిరెడ్డి,వేముల సత్యనారాయణ, రంజాని నరేశ్, అంజనేయులు, ప్రశాంత్, ముద్దం రాజు, ఉచ్చిడి బాల్‌రెడ్డి మహేందర్, అనిత, తాళ్ల విజయ్‌రెడ్డి, ఏదునూరి భానుచందర్, తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ : వేములవాడ పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్‌చైర్మన్ కనికరపు రాకేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంద్రగిరి శ్రీనివాస్, బ్లాక్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బింగి మహేష్, నాయకులు కూరగాయల కొమురయ్య, చిలుక రమేష్, పులి రాంబాబు, ఇప్పపూల అజయ్, నాగుల విష్ణుప్రసాద్, అంబటి చంద్రశేఖర్, న్యాత నవీన్, మైలారం రాము తదితరులు ఉన్నారు.

● తంగళ్లపల్లి : మండల కేంద్రంలో ఇందరనగర్‌లో దివంగత మాజీ ప్రధాని ఇందిరగాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఇందిరగాంధీ విగ్రహనికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జల్గం ప్రవీణ్, నేరెళ్ల నిర్సంగంగౌడ్, లింగాల భూపతి, మచ్చ శ్రీనివాస్, మోర లక్ష్మీరాజం, ఆసాని సత్యనారయణరెడ్డి, మునిగెల రాజు, చుక్క శేఖర్, గుగ్గిళ్ల భరత్‌గౌడ్, రాపెల్లి ఆనందం తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి : దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇందిరాగాంధీ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం, వైస్ చైర్మన్ రాంరెడ్డి, నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, బాబు, గిరిధర్‌రెడ్డి, రాజయ్య, శ్రీనివాస్, ఇమాం, బాల్‌రెడ్డి, కిషన్, రాజుకుమార్ పాల్గొన్నారు.

● రుద్రంగి : మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను మండల కేంద్రంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ గరిబీ హఠావో అనే నినాదంతో దేశంలోని ప్రతి పేదవాడి కడుపు నింపిన గొప్ప నాయకురాలు ఇందిరాగాంధీ అని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, మాజీజడ్పీటీసీ గట్ల మీనయ్య, తర్రె మనోహర్, ఎర్రం గంగ నరసయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, గండి నారాయణ, కొమరే శంకర్, కేశిరెడ్డి నర్సారెడ్డి, మాడిశెట్టి అబిలాష్, ఇప్ప మహేష్, పల్లి గంగాధర్, తర్రె లింగం, దయ్యాల శ్రీను, సూర యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

వేములవాడ, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి కుంఫూ, కరాటె పోటీల్లో వేములవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈనెల 18వ తేదిన మంచిర్యాల జిల్లాలో జరిగిన 5వ రాష్ట్రస్థాయి కుంఫూ, కరాటె పోటీల్లో ప్రభుత్వ పాఠశాలకు చెందిన కృష్ణ చైతన్య గోల్డ్ మోడల్ సాధించగా ప్రవీణ్, సృజన్ అనే విద్యార్థులు రెండవ స్థానంలో నిలిచి సిల్వర్ మోడల్ సాధించినట్లు పీడీ హమీద్ బుధవారం తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు రాజరత్నం ఉపాధ్యాయులు రవీందర్, చంద్రమౌళి, బాలకృష్ణ, శిరోమణిలు అభినందించారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన విప్

చందుర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం బండపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఏనుగుల లచ్చిరెడ్డి తల్లి రామవ్వ అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి, మాజీ జడ్పీటీసీ నాగం కుమార్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేలకల తిరుపతి, వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం నాయకులు నర్సారెడ్డి, సంతోష్ రెడ్డి, పొద్దుపొడుపు లింగారెడ్డి, ముకుంద రెడ్డి, మల్లేశం తదితరులు పరామర్శించారు.

విద్యార్థినులకు శానిటరీ న్యాప్‌కిన్స్ పంపిణీ

సిరిసిల్ల టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : నారీ మహిళా ఆరోగ్య సంకల్పం ప్రియదర్శిని ఉడాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు కాంగ్రెస్ మహిళ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత శానిటరీ న్యాప్‌కిన్స్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కలంబా, రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతారావుల ఆదేశాల మేరకు న్యాప్‌కిన్స్ పంపిణీ చేశామన్నారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, మహిళా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం అరుణ, ఉపాధ్యక్షురాలు కోడం రోజా, పట్టణ కార్యదర్శి రజని తదితరులు పాల్గొన్నారు.

బోగస్ సంఘాలకు చెక్

(5వ పేజీ తరువాయి)

క్రీడా శాఖకు అందించాల్సి ఉంది. గతంలో క్రీడా సంఘాల్లో ఉన్నవారు ఇతర జిల్లాల్లో స్థిరపడ్డవారు ఇంకా కొనసాగుతున్నారు. అలాంటివారిని ప్రస్తుతం తొలగించే పరిస్థితి ఉండడంతో వివరాలు అందించడానికి మల్లగుల్లాలు పడుతున్నట్లుగా తెలుస్తోంది. ప్రతి క్రీడాసంఘం నాలుగేళ్లకు ఒకసారి కొత్త కమిటీ ఎన్నుకోవడం, మూడు నెలలకు ఒకసారి జనరల్‌బాడీ సమావేశం నిర్వహించుకోవాల్సి ఉంటుంది. జిల్లాలో ఉన్న సంఘాలు జనరల్ బాడీ సమావేశాలు నిర్వహించుకోవడం మొక్కు బడిగా మారిందనే విమర్శలున్నాయి. జిల్లాలోని సంఘాల వివరాలు సేకరించి గుర్తింపులేని వాటిపై చర్యలు తీసుకోవడంతో పాటు నూతన క్రీడా పాలసీ రూపొందించడానికి శాట్ కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది.

మృతుడి కుటుంబానికి పరామర్శ

చందుర్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కిష్టంపేట గ్రామానికి చెందిన అంబిరి లింగం ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు బుధవారం పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, నాయకులు అంబిరి నరేష్, కొమ్ము రమేష్, ఇస్మాయిల్ తదితరులు ఉన్నారు.

ఆలోచన విరమించుకోవాలి

చందుర్తి నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు ఇవ్వడాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని తెలంగాణ మధ్యాహ్న భోజనం పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నడిగోట్టు లక్ష్మి అన్నారు. చందుర్తిమండల విద్యావనరుల కేంద్రంలో మధ్యాహ్న భోజన పథకంను అక్షయపాత్రకు ఇవ్వడాన్ని విరమించుకోవాల మధ్యాహ్న భోజన పథకం నిర్వహకులు ఎంఈఓకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో మధ్యాహ్న భోజన నిర్వాహకులు లక్ష్మన్, ఎల్.లక్ష్మి, రాజేశ్వరి,మల్లవ్వ,విజయ, రేణుక, పద్మ, స్వరూప, వినోద, రజిత, తదితరులు పాల్గొన్నారు.

స్థలం పరిశీలన

ఎల్లారెడ్డిపేట, నవంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచర్లబొప్పాపూర్ గ్రామశివారులోని జక్కుల చెరువు ప్రాంతంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈనెల 20న నిర్వహించనున్న కార్తీక దీపోత్సవ కార్యక్రమ స్థలాన్ని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఏర్పాట్లను అడిగితెలుసుకున్నారు. విద్యారణ్య భారతీస్వామి హాజరుకానున్న నేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా భద్రత చర్యలు చేపడుతున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు. ఆయన వెంట సభ్యులు రంజిత్‌కుమార్, ప్రభాకర్‌రెడ్డి, భీమేశ్వర్, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

పేదల వైద్యానికి పెద్దపీట

ఎల్లారెడ్డిపేట, నవంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నారాయణపూర్‌లో లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను స్థానిక నాయకులతో కలిసి బుధవారం ఏఎంసీ చైర్‌పర్సన్ సబేరాబేగం పంపిణీ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లోని లబ్ధిదారులకు రూ.15.61 లక్షలు అందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జాఫర్, నాయకులు నర్సయ్య, గౌస్, మహేందర్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలో పేదల సంక్షేమమే లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం వేములవాడ పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు విప్ ముఖ్యమంత్రి సహాయనిధి, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. ఇందులో వేములవాడ అర్బన్ మండలానికి చెందిన 19 మంది, వేములవాడ రూరల్ మండలానికి చెందిన 15మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, అర్బన్ మండల పరిధిలో 23 మంది లబ్ధిదారులకు 9 లక్షల 10 వేల రూపాయలు, పట్టణ పరిధిలో 27మంది లబ్ధిదారులకు 12 లక్షల 87 వేల రూపాయలు, రూరల్ పరిధిలో 27 మంది లబ్ధిదారులకు 9 లక్షల 97 వేల రూపాయల చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వంలో ఇందిరమ్మ రాజ్యంలో పేద ప్రజలకు అనేక పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ కనికరపు రాకేష్, తహసీల్దార్‌లు అబుబాకర్, రాజ ప్రకాశ్, ఎంపీడీవో శ్రీనివాస్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, రూరల్ అధ్యక్షుడు వి. శ్రీనివాస్, అర్బన్ అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, వస్తాద్ కష్ణ, పులి రాంబాబు, సోయినేని కరుణాకర్, నాగుల విష్ణు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

● కోనరావుపేట : ఇందిరమ్మ రాజ్యంలో పేదలకు అనేక సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో అమలు చేస్తున్నామని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కోనరావుపేట మండలం కనగర్తిలోని రెడ్డి సంఘంలో 71 మంది లబ్ధిదారులకు 26లక్షల 14వేల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోనరావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, జిల్లా నాయకుడు కేలిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ తాళ్లపల్లి ప్రభాకర్, ప్యాక్స్ చైర్మన్ బండ నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు నాలుక సత్యం, సాసాల మల్లారెడ్డి, దేవరాజు, జడ్పీ సీఈవో గీత, ఎంపీడీవో స్నిగ్ధ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

పాఠశాలల్లో స్వయంపరిపాలన దినోత్సవం

ఇల్లంతకుంట, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో బుధవారం స్వయంపరిపాలన దినోత్సవం జరిగింది. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిణి ప్రేమలత, ఉపాధ్యాయులు మహేష్‌చంద్ర, రమణారెడ్డి, మధుసూదన్‌రావు, మంజుల, లత, అనీల్‌కుమార్, సునీత, కవిత, స్వప్న, సరిత, ఫయాజ్ మొహమ్మద్, సుజాతదేవి పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్ : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్వయంపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు వీఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పద్మ, కొండికోప్పుల రవి, రమ, మధుసూధన్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : గంభీరావుపేట మండలం గజసింగవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం మాలోత్ రవి, ఉపాధ్యాయులు ఎర్ర సత్యనారాయణ, పాశం తిరుపతి, అంజయ్య, శాంత, సురేష్, సుమలత, రమ్య ఉన్నారు.

● కోనరావుపేట : కోనరావుపేట మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. మండల విద్యాధికారి మురళి నాయక్, హెచ్‌ఎం అజ్మీర, మదన్‌లాల్, రహీం, ఉపాధ్యాయులు విజయ్ కుమార్, భాస్కర్, రాము, వెంకటేష్, సంజీవ్, శృతి, అనూష, రాధ, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతో పాటు దుమాల ప్రభుత్వ ప్రాథమిక, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బుధవారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



వీర్నపల్లిలో క్షీరాభిషేకం చేస్తున్న ఆటోడ్రైవర్లు

ఎల్లారెడ్డి పేట/వీర్నపల్లి, నవంబరు19(ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికులకు ప్రమాద బీమా వర్తించేందుకు ప్రిమియం డబ్బులను తాను స్వయంగా చెల్లిస్తానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ హామీ ఇవ్వడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాల్లోని ఆటో డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలోని కార్మికులు బుధవారం కేటీఆర్ చిత్ర పటానికి పాలభిషేకం చేశారు. ఆటో కార్మికుల కుటుంబాలు వీధిన పడకుండా ప్రమాద బీమా అందించేందుకు కేటీఆర్ ముందుకు రావడం అభినందనీయమని ర్కొన్నారు. ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

● ముస్తాబాద్ : ముస్తాబాద్ మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం కూడలిలో మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశా రు. బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆటోడ్రైవర్లకు ప్రమాద బీమా కడు తానని కేటీఆర్ ప్రకటించడంపై హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు బొంపెల్లి సురేందర్‌రావు, మాజీ సెస్ డైరెక్టర్ ఏనుగు విజయరామా రావు, కొమ్ము బాలయ్య, జిల్లా మాజీ కోఆప్షన్‌మెంబర్ ఎండీ సర్వర్ పాషా,గూడూ రు భరత్, మాజీ ఎఎంసీచైర్మన్ యాది మల్లేశ్, ఎద్దండి నర్సింహరెడ్డి, శీలం స్వామి, అన్వర్, నల్ల నర్సయ్య, ఎండీ నవాజ్, నర్సింలు, కొండ శ్రీనివాస్‌గౌడ్, వంగూరి దిలీప్, జహంగీర్, గూడూరు భరత్ పాల్గొన్నారు.

రాజన్న ఉద్యోగుల అంతర్గత బదిలీ

వేములవాడ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీ రాజరాజేశ్వరస్వామి 17మంది ఉద్యోగులకు అంతర్గత బదిలీలు చేయడమే కాకుండా శ్రీ భీమేశ్వరాలయంలో అదనపు విధులు కేటాయిస్తూ ఇవో రమాదేవి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఆలయ ఏఈవోలు జి.అశోక్‌కు అనుబంధ దేవాలయాలు, బి. శ్రీనివాస్‌కు ప్రధాన ఆలయం, గోశాల, గోదాం, శానిటేషన్, దత్తత ఆలయాలు, ప్రసాదాల విక్రయాలతో పాటు భీమేశ్వరాలయం, ప్రచార రథం, ఆలయ పర్యవేక్షకులు వి. సంతోష్‌కు పరిపాలన, లీగల్ విభాగాలతో పాటు అదనంగా సెంట్రల్ గోదాం, వి. వెంకటప్రసాద్‌కు అనుబంధ దేవాలయాలు, దత్తత దేవాలయాలు, ఆర్. విజయ్‌కుమార్‌కు పిఆర్‌ఓ, సమాచార కేంద్రం, గోశాల, వి. శ్రీకాంతచారికి హౌజ్ కీపింగ్, ప్రసాదాల తయారీ, విచారణ కార్యాలయం, సీనియర్ అసిస్టెంట్‌లు వి.శ్యాంకు శ్రీ భీమేశ్వరాలయం, అనుబంధ ఆలయాలు, ఎడ్ల శివ సాయికి శ్రీ భీమేశ్వరాలయం, వేదపాఠశాల, జూనియర్ అసిస్టెంట్‌లు కూరగాయల శ్రీనివాస్ లీజ్ విభాగం, పందిళ్ల శ్రీనివాస్‌కు ప్రధాన తూర్పు రాజగోపురం వద్ద ప్రచార రథం, కె. సింహాచార్యులు ప్రోటోకాల్‌తో పాటు అదనంగా భీమేశ్వరసదన్, పోసాని రాజుకు సానిటరి ఇన్స్‌పెక్టర్-2, టి. అజయ్‌కుమార్‌కు ప్రసాదాల విక్రయాలు, ధీటి మమతకు భక్తుల సమాచారం కేంద్రం, ప్రోటోకాల్, వి. పరమేశ్‌కు అన్నదానం, సంస్కృత పాఠశాల, రికార్డ్ అసిస్టెంట్ పి. గణేశ్‌కు ప్రచార రథం, అటెండర్ జ్యోతికి కోడెల చెక్‌పోస్ట్‌నకు స్థానచలనం కల్పించారు.

తాగునీటి ట్యాంక్ పరిసరాల శుభ్రం..

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



గంభీరావుపేటలో శుభ్రమైన తాగునీటి ట్యాంక్ పరిసరాలు

గంభీరావుపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గంభీరావుపేట మండల కేంద్రంలో పారిశుద్ధ్య లోపంపై ఎట్టకేలకు గ్రామ పంచాయతీ అధికారులు స్పందించారు. ప్రధాన రహదారిలో ఉన్న తాగునీటి ట్యాంకు పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు ట్యాంక్ పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేశారు. చెత్తాచెదారాన్ని తొలగించి, బ్లీచింగ్ చల్లారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక, మొరం అనుమతించాలి

సిరిసిల్ల టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక, మొరం అనుమతించాలని సీపీఐ, ఏఐటీయూసీ జిల్లా నాయకులు బుధవారం సిరిసిల్ల తహసీల్దార్ మహేష్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఇసుక, మొరం లేక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారని, తీసుకోవడానికి అనుమతులు ఇవ్వాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, ప్రధాన కార్యదర్శి కడారి రాములు, జిల్లా సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు ఒడ్డెపెల్లి లక్ష్మన్, మంత్రి చంద్రయ్య, రమేష్, మధుసూదన్ పాల్గొన్నారు.

మానేరు నుంచి ఇసుక తీసుకునేందుకు అనుమతివ్వాలి

తంగళ్లపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మానేరు నది నుంచి నిత్యం ఇసుక అనుమతి ఇవ్వాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ జయంత్‌కుమార్‌కు బుధవారం వినతి పత్రం సమర్పించారు. నాయకులు కడారి రాములు,మంద సుదర్శన్, అజ్జు, వేణు, వడ్డెపల్లి లక్ష్మణ్, మంత్రి చంద్రయ్య, మంచికట్ల రమేష్, గడ్డం మధుసూదన్ తదితరులు ఉన్నారు.

ఓపెన్ జిమ్ చుట్టూ మురుగునీరు..



మురుగు మధ్యలో ఉన్న జిమ్ పరికరాలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రజల ఆరోగ్యం మెరుగు పర్చుకునేందుకు ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాల పట్ల అధికారుల పర్యవేక్షణ కరవైంది. పరికరాల చుట్టు మురుగు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. వ్యాయామం చేసేందుకు పల్లె ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాల చుట్టూ మురుగు నీరు చేరి వ్యాయామం చేసేందుకు వీలు లేకుండాపోయింది. జిమ్ పరికరాల వద్ద మురుగు నీరు చేరి కంపు కొడుతోంది. ఆహ్లాదకర వాతావరణంలో వ్యాయామం కోసం వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గమనించక కాలు వేస్తే జారి పడిపోతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ఓపెన్ జిమ్ పరికరాల చుట్టూ ఉన్న మురుగును తొలగించాలని యువతీయువకులు, స్థానికులు కోరుతున్నారు.

బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ అండ



కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు, మహిళలు

రుద్రంగి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) బడుగు బలహీన వర్గాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. బుధవారం రుద్రంగి మండలం మానాల గ్రామంలోని బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ముదిరాజ్ రెండుకుల సంఘ సభ్యులు సుమారు 200 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు చూసి కాంగ్రెస్ పార్టీలోకి వివిధ పార్టీల నుండి పెద్ద ఎత్తున చేరికలు జరుగుతున్నాయన్నారు. రానున్నరోజుల్లో స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి ప్రతిఒక్కరు కృషి చేయాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ పీసరి తుక్కన్న, మాజీ ఏఎంసి డైరెక్టర్ తిక్క భూమయ్య, నాయకులు జలంధర్, లస్మయ్య, జక్కు రాజారాం తోపాటు సుమారు 200 మంది ముదిరాజ్ కుల సభ్యులు, మహిళలు, యూత్ సభ్యులు చేరారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొమ్ము రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూం జలపతి నాయకులు తర్రె మనోహర్, ఎర్రం గంగనరసయ్య, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, జక్కు మోహన్, గండి నారాయణ, జక్కు వంశీ, జక్కుల లక్ష్మి నర్సయ్య, తూం రవీందర్, ఇప్ప మహేష్, జూల దిలీప్, మాడిశెట్టి అభిలాష్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు,

హుజూరాబాద్ తరలిన నాయకులు

కోనరావుపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి బీజేపీ మండల నాయకులతో పాటు అనుబంధ పార్టీ నాయకులు బుధవారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు మిరియాల బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్

ఇల్లంతకుంట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వాణీనికేతన్ హైస్కూల్‌లో మాక్ పోలింగ్ జరిగింది. విద్యార్థులకు ఎన్నికల సంఘం నిర్వహించే విధులు, పోలింగ్ విధానంపై అవగాహన కల్పించాలనే లక్ష్యంతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ తూముకుంట శ్రీనిధి పేర్కొన్నారు. పాఠశాలలో బుధవారం హెడ్ గర్ల్, హెడ్ బాయ్ కోసం జరిగిన ఎన్నికలలో విద్యార్థులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. హెడ్‌గర్ల్‌గా వైష్ణవి, హెడ్ బాయ్‌గా రవితేజలు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.